తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలంలోని శిరాగం పంచాయతీ మారుమూల వర్రా గ్రామంలో మంచినీటి సమస్యతో గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజులుగా వీధుల కొళాయిల్లో మంచినీటి రాక తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతూ సమీపంలోని ఊటగెడ్డల్లో కలుషిత నీటిని తెచ్చుకుని తమ అవసరాలకు వినియోగిస్తున్నామని గిరిజనులు శుక్రవారం ఉదయం వాపోయారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యపై చొరవ తీసుకొని పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు, పిల్లలు

మైదాన ప్రాంతానికి తరలిస్తున్న వ్యాపారులు

అడ్డాకులకు గిట్టుబాటు ధర ఏదీ?

▸▸ కొనుగోలు చేయని జిసిసి ▸▸ వారపు సంతలో సిండికేట్‌గా వ్యాపారులు ▸▸ తక్కువకు కొనుగోలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులైన అడ్డాకులను జిసిసి కొనుగోలు చేయక పోవడంతో మైదాన ప్రాంత వ్యాపారస్తులు వాటిని కొనుగోలు చేస్తూ తరలించకపోతున్నారు. వ్యాపారులు సిండికేట్ అయి వారికి నచ్చిన విధంగా ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో, కష్టపడి అడ్డాకులను సేకరించిన గిరిజనులకు సరైన గిట్టుబాటు కలగక పోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో అడ్డాకులను జిసిసి కొనుగోలు చేస్తుండడంతో గిరిజనులకు గిట్టుబాటు ధర వచ్చేది. గత కొన్నేళ్ళ నుంచి జిసిసి కొనుగోలు చేయక పోవడంతో వారపు సంతల్లో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

మండలంలో శుక్రవారం జరిగిన వారపు సంతలో సుమారు 40 కిలోల దిండికు రూ 1800లకు కొనుగోలు చేశారు. వారం రోజులపాటు కష్టపడి సేకరించి వారపు సంతలకు తరలించిన లగేజ్ చార్జీలు కూడా రాలేదంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం అధికారులు స్పందించాలని గిరిజనులు తెలిపారు. అడ్డాకులకు సరైన గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకొని గతంలో మాదిరిగా ప్రభుత్వం స్పందించి అడ్డాకులు జిసిసి ద్వారా కొనుగోలు చేసే విధంగా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి అరకులోయ రూరల్: అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై పోరాటం చేసి వారి కష్టాలు తీర్చేది సిఐటియునేనని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అరుకులోయ మండలం పద్మపురం గార్డెన్ వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు పోరాటాలు నిర్వహిస్తూ, కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికులకు కనీస వేతనం, హక్కుల రక్షణ కోసం నిత్యం పోరాటాలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. కార్మికులలో కుల, మత ప్రాంత భేదాలు లేకుండా దేశ సమైక్యత నింపుతూ, కార్మిక వర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా సిఐటియు పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని, ఇవి కార్మికులకు ఉరి తాడుగా మారినాయని వాపోయారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, 44 లేబర్ చట్టాల అమలుకై జులై 9న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాడి రాజు, ఆటో కార్మిక సంఘం నాయకులు రమేష్, పద్మాపురం గార్డెన్ వర్కర్స్ నాయకులు శ్రీరామ్, జగ్గారావు, గురుమూర్తిపాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్ష చేస్తున్న సిపిఎం నాయకులు

రోడ్ల కోసం కొనసాగిన రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - ఎటపాక : గుండాల పంచాయతీలో రోడ్లు నిర్మించాలని నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష రెండో రోజుకు చేరుకుంది. రిలే నిరాహారదీక్ష గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఉప సర్పంచ్ తోట శశికుమార్, సిపిఎం నాయకులు ప్రారంభించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ దీక్ష అనంతరం సమస్య పరిష్కారం కాకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని, ప్రజలంతా ఈ పోరాటాల్లో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. రోడ్లు వేసేందుకు నిధులు ఉన్నాయని, రోడ్లు వేస్తామని చెబుతూ, కాలయాపన చేస్తున్న పజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి, పార్టీ మండల కమిటి సభ్యులు ఐ.పద్మ, జి.హరి, ఇరపా సత్యం, శాఖ కార్యదర్శి తోట శ్రీను, డివైఎఫ్ఐ నాయకులు ఎన్.సుధాకర్, సీసం అర్జున్, బండారు స్టాలిన్, తోట వెంకటరమణ, తోట రమణ, రఘు, ప్రసాద్, నాని తదితరులు పాల్గొన్నారు.

654 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండలానికి ఖరీఫ్ సీజన్‌కు 654 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు పెట్టామని ఎఒ డి.ఉమాదేవి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు మండలంలో సుమారు 5,500 ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉందన్నారు. దీంతో అదనంగా మరిన్ని విత్తనాలు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఇ క్రాప్‌లో నమోదైన రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ఎకరానికి 20 కిలోల చొప్పున మాత్రమే విత్తనాలు వేయాలని రైతులకు సూచించారు.

ఎఒ ఉమాదేవి

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం..

జీపు జాతాను జయప్రదం చేయాలి

హుకుంపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -హుకుంపేట : ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలు, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జీపు జాతాను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. జీపు జాతా ఈనెల 31న సీతంపేటలో ప్రారంభమై, జూన్ 4న కె.ఆర్.పురం ఐటిడిఎ కార్యాలయం ఎదుట ముగియనుందన్నారు. ఇందులో భాగంగా జూన్ 2, 3 తేదీల్లో అరకు, పాడేరు నియోజకవర్గాల్లో జాతా నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తాపుల కృష్ణారావు, హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, జిల్లా మహిళా సంఘం కార్యదర్శి సొంటేన హైమావతి, మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణ్ రావు, వైస్ సర్పంచ్‌లు కిల్లో రామారావు, కృష్ణమూర్తి, నాయకులు కొర్ర అప్పారావు, పాంగి లింగమూర్తి పాల్గొన్నారు.

కొయ్యూరులో నిరసన

కొయ్యూరు : జిఒ నంబర్-3కి ప్రత్యామ్నాయ జిఒను తీసుకు రావాలని కొయ్యూరు మండలానికి చెందిన పలువురు నిరుద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం మర్రిపాలెం ప్రధాన రహదారిపై మోకాళ్లపై కూర్చుని వినూత్న నిరసన చేపట్టారు. అనంతరం భిక్షాటన చేపట్టి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. జిఒ నంబర్-3 లేకపోవడంతో మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు అన్యాయం జరిగిందన్నారు.

విఆర్‌పురం: ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, జిఒ నెంబర్ 3ని అమలు చేయాలని రామవరం పంచాయతీ సచివాలయం ముల్కనపల్లి, పెద్దమట్టపల్లి ముందు సిపిఎం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయం అధికారులకు వినతిపత్రం అందించారు. ఏజెన్సీలో గిరిజనులకు శతశాతం ఉద్యోగాలు కల్పించాలని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో విఆర్ పురం మండలం ఎంపిపి కారం. లక్ష్మి , సిపిఎం మండల కార్యదర్శి. సంతోష్‌కుమార్, ప్రజా ప్రతినిధులు ఎంపిటిసి పూణెం. ప్రదీప్‌కుమార్, సర్పంచ్ కారం బుచ్చమ్మ, ములకనపల్లి సర్పంచ్ సబలం మారయ్య, పెద్ద మట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి మండల కమిటీ సభ్యులు, పీసా కమిటీ సభ్యులు సిపిఎం మండల కార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

రీ వెరిఫికేషన్ , రీకౌంటింగ్‌కు మరో అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: టెన్త్ ఇంటర్ రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ ఫలితాల్లో కొంతమంది విద్యార్థులకు ఎక్కువ మార్కులు రావడం జరిగిందని, అలాగే ఫెయిలైన విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని ఈ నేపథ్యంలో రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మరో అవకాశం ప్రభుత్వం కల్పించాలని స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్ పిఎంసి చైర్మన్ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు మరో అవకాశం కల్పించాలన్నారు. పాఠశాల కమిటీ సభ్యులు పాపాని బద్రి,ఆలీ, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

పోడు భూముల పట్టాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు ఐటిడిఎ కార్యాలయం నందు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఎటపాక పంచాయతీ సంబంధించి బోజ్జీగుప్ప, రాయిగుడెం, గంగారం, చేన్నంపేట మేడువాయ, రాజుపేట గ్రామాలకు సంబంధించిన పోడు భూములకు పట్టాలు అందించాలని గిరిజనులు పిఒకు శుక్రవారం దరఖాస్తులు అందించారు. రెండు రోజుల కిందట చింతూరు ఐటిడిఎ పిఒ 2006 నుంచి సాగుచేసుకుంటూ పట్టాలు పొందకుండా ఎవరున్నారో అటువంటి వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శుక్రవారం అర్హులంతా దరఖాస్తు చేశారు. కార్యక్రమంలో అటవీ హక్కుల అధ్యక్షుడు కట్టం సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు కాక వెంకన్నబాబు (నాగేశ్వరరావు) తదితరులు పాల్గొన్నారు.

కూటూరు సర్పంచ్ ఆధ్వర్యంలో దరఖాస్తు చేస్తున్న రైతులు

కూనవరం : గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ ఆధ్వర్యంలో దరఖాస్తులు అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య మాట్లాడుతూ ఇప్పటికైనా పోడు భూములు బాధిత రైతులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మేకల నాగేశ్వరావు, మాజీ ఎంపిటిసి పైదా భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన అభ్యర్థులతో కలెక్టర్

54 మందికి నియామక పత్రాలు

ప్రజాశక్తి -పాడేరు: జాబ్ మేళా ద్వారా ఉపాధి పొందిన అభ్యర్థులందరూ మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడేరు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద జరిగిన జాబ్ మేళాలో ఎంపికైన 54 మందికి నియామక పత్రాలను ఐటిడిఎ సమావేశ మందిరంలో కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళాలతో అనేక మంది ఉపాధి పొందుతున్నారని, వారంతా మరింత కష్టపడి మెరుగైన అవకాశాలు పొందాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో తొమ్మిది కంపెనీలు పాల్గొన్నాయని, 183 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా 54 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, మరో 34 మందిని తదుపరి ఇంటర్వ్యూ దశకి ఎంపిక చేయడం జరిగిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి . పి. రోహిణి కలెక్టర్ కు వివరించారు.

పునాది దశలో ఉన్న పాఠశాల భవనం

ఏడేళ్లుగా.. పునాదులకే పరిమితం

-ఇదీ జడుగూరు పాఠశాల భవనం దుస్థితి

ప్రజాశక్తి-చింతపల్లి: సాంకేతిక విజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో కూడా కొంతమంది విద్యార్థులు చెట్ల నీడనే చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చింతపల్లి మండలం కుడుముసారి పంచాయతీ జడుగూరు గ్రామంలో ఏడేళ్ల క్రితం పాఠశాల భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ పనులు పునాదుల దగ్గరే ఆగిపోయాయి. పనులు మధ్యలోనే నిలిచి పోవడంతో ఈ భవనం ఖాళీ గోడలుగా మిగిలాయి. ఫలితంగా విద్యార్థులు ఇప్పటికీ చెట్ల కిందే పాఠాలు చదువుతున్నారు. పాఠశాల రికార్డులను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాఠశాల భవన నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన..

రిసార్ట్స్, భవంతుల సంగతేంటో తేల్చండి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, చిత్రంలో లోతా రామారావు, మట్ల వాణిశ్రీ తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం, మారేడుమిల్లి మండల కేంద్రాల్లో గిరిజనేతరులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవంతులు, రిసార్ట్స్, లాడ్జీలు సంగతి ముందు తేల్చాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయట ప్రాంతం నుండి గిరిజన ప్రాంతానికి వచ్చిన గిరిజనేతర బడా బాబులు మారేడుమిల్లి, రంపచోడవరం రెండు మండలాలలో రిసార్ట్స్, లాడ్జీలు, మల్టీస్టోర్డ్ భవంతులు నిర్మించారని తెలిపారు. అలాంటి వారిని వదిలిపెట్టి బతుకుదెరువు కోసం చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనే వారి మీద చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న గిరిజనేతర చిన్నచిన్న వ్యాపారస్తులు తొలగింపు కార్యక్రమానికి ప్రభుత్వానికి, అధికారులకు ఎలా అయితే సహకరిస్తున్నారో, అక్రమ కట్టడాలు, రిసార్ట్స్, లాడ్జీలు కట్టుకున్న వారు కూడా అలాగే సహకరించాలని కిరణ్ కోరారు. సంబంధిత అధికారులు అక్రమ రిసార్ట్స్‌పైన స్పందించకపోతే సిపిఎం, గిరిజన సంఘం తరపున తామే మారేడుమిల్లి, రంపచోడవరం కేంద్రాల్లో గిరిజన చట్టాలకు విరుద్ధంగా నిర్మించిన రిసార్ట్స్, భవంతులు సంగతి తేలుస్తామని అధికారులను హెచ్చరించారు.

ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, నాయకులు కంభం శాంతిరాజు, గిరిజన సంఘం నాయకులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, తీగల శ్రీను, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

మారేడుమిల్లి : మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా అక్రమ కట్టడాలు తొలగింపు కార్యక్రమం రెండో రోజూ కొనసాగింది. మారేడుమిల్లి మండలంలోని ఆర్ అండ్ బి రోడ్లపై నిర్మించిన అక్రమ కట్టడాలను రంపచోడవరం ఐటీడీఏ పిఓ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎస్పి సాయిప్రశాంత్ పరవేక్షణలో తొలగించడం జరిగింది. ఉదయం నుండి జెసిబిల సహాయంతో ఆర్అండ్‌బి రోడ్డుపై నుండి ఇరువైపులా సుమారు 12 మీటర్ల మేర రోడ్డుపై ఉన్న దుకాణాలు, భవనాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ,పోలీసు, ఆర్అండ్ బి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో తొలగిస్తున్న ఆక్రమణలు

మావోయిస్టు ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది పర్యటన

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన పాత్రునిగుంట, సప్తగూడ, బుగ్గిరేవులు, మైనకోట, గుర్రాలగొంది గ్రామాల్లో ఎస్సై రవీంద్ర తన సిబ్బందితో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గిరిజనులతో సమావేశమై గ్రామాల్లో సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. ఊటనీరు తాగడం వలన రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. ముఖ్యంగా రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సప్తగూడలో గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు, పౌష్టికాహారం సక్రమంగా నిర్వాహకులు అందించడం లేదని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ రహదారి సౌకర్యం లేక సక్రమంగా అందడం లేదని లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గాలికొండ పంచాయతీ పరిధి గ్రామాల్లో రహదారి లేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని అత్యవసర సమయంలో వైద్యసేవలు పొందలేని దుస్థితి నెలకొందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సరిగా రావడం లేదని కూడా గిరిజనులు ఫిర్యాదు చేశారన్నారు. సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎస్ఐ కే.రవీంద్ర పేర్కొన్నారు.

సప్తగూడలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

ఎపి జెన్‌కో ఎడిఇగా జైపాల్

ప్రజాశక్తి - సీలేరు: సీలేరు ఎపి జెన్‌కో ఎడిఇగా జైపాల్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఎడిఇగా విధులు నిర్వహించిన దుర్గా శ్రీనివాస్‌ను విజయవాడకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన విద్యుత్‌సౌదాలో ఎడిఇగా బాధ్యతలు చేపట్టారు. ఈయన స్థానంలో విజయవాడ విద్యుత్ సౌదాలో ఎఇగా కొనసాగుతున్న జైపాల్‌ను పదోన్నతిపై ఎపి జెన్‌కో సివిల్ సర్కిల్ కి బదిలీ చేశారు.

ఎడిఇ జైపాల్

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		

జిజిహెచ్‌లో రిహాబిలిటేషన్ సెంటర్

ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు జిజిహెచ్ లో ఏర్పాటు చేసిన ఎబిలిటీ పీపుల్ రిహాబిలిటేషన్ సెంటర్ సేవలను అవసరమైన రోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం జిజిహెచ్‌లో ఏర్పాటు చేసిన ఎబిలిటీ పీపుల్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కేంద్రం గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణను పెంచుతుందన్నారు. రిహాబిలిటేషన్ కేంద్రం ద్వారా, ఫిజియోథెరపి, ఆక్యుపేషనల్ థెరపి, ప్రోస్థెటిక్ థెరపి వంటి సమగ్ర పునరావాసాన్ని అందించడం ద్వారా వారి జీవితాలను మార్చుతుందని, శక్తిని పుంజుకుంటారని అన్నారు. పేద వర్గాలకు ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉండటంలో ఒక ముఖ్యమైన అడుగు ముందుకు పడిందన్నారు. గిరిజన ప్రాంతంలోని వ్యక్తుల జీవన నాణ్యతను మెరుగు పరచడం లక్ష్యంగా పెట్టుకుని కేంద్రం ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఫౌండర్ అబీష్ ప్రాత్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ ప్రొఫెసర్ నరసింహారావు, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామి నాయుడు, ఎబిలిటీ పీపుల్ రిహాబిలిటేషన్ సెంటర్ సిఇఒ వంశీ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: స్థానిక ఐసిడిఎస్ ఆధ్వర్యం లో మండలంలోని పలు అంగన్వాడి కేంద్రాల్లో కిశోర బాలికలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ నీలిమ మాట్లాడుతూ, బాలికల కోసం వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాల్లో బాల్యవివాహ నివారణ, కౌమారదశ గర్భధారణ నివారణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా విసిసి సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శుక్రవారం మొదటిరోజున విజ్ఞానదాయకంగా సాగింది. విద్యార్థులకు ప్రాంతాల వారీగా వివిధ సామాజిక అంశాలపై టీం ఆక్టివిటీ స్కిట్ చేయించారు. మధ్యాహ్నం కార్టూన్ వేయడం, కథ రాయడంపై కార్టూనిస్ట్, రచయిత హరి వెంకటరమణ అవగాహన కల్పించారు. కార్టూన్స్‌తో బాలల హక్కులను వివరించారు. చివరిలో విద్యార్థులకు వివిధ రకాల సబ్జెక్టులు ఇచ్చి, వాటిపై చిత్రాలు గీయమన్నారు. పిల్లలందరూ బృందాలుగా ఏర్పడి, ఉత్సాహంగా బొమ్మలు గీసారు. తరువాత కథ అంటే ఏమిటి, కథ చెప్పడం, రాయడంపై వివరించారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుల పరశురాం పిల్లలు వృత్తిగతమైన క్రమశిక్షణపై తెలియజేశారు. విసిసి నాయకులు కె.రామప్రభ డి తైజాల జాన్సీ, కళ్యాణి, సరోజిని, గుణశంకర్, శ్రీ కుమార్, పద్మిని, దీపిక, బాల, హేమ, ఆజాద్,అంజలి, దేవి నేతృత్వంలో 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని విసిసి జిల్లా కన్వీనర్ కె.సుశీల తెలిపారు.

రేషన్ పంపిణీలో కీలక మార్పులు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: రేషన్ పంపిణీలో జూన్ నుంచి కీలక మార్పులు చోటు చేసుకోబోతున్నాయని సివిల్ సప్లై తహశీల్దార్ అల్లు సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. రేషన్‌షాపుల వద్దే రేషన్ పంపిణీ చేయబోతున్నారు. జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి, మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమయాల్లో మాత్రమే రేషన్ పంపిణీ చేస్తారని కార్డుదారులు సహకరించాలని కోరారు.

పునరావాస కాలనీల పరిశీలన

- అయోమయంలో గిరిజనేతర నిర్వాసితులు

పునరావాస కాలనీని పరిశీలిస్తున్న సీతంపేట, శ్రీరామగిరి గ్రామస్తులు

ప్రజాశక్తి - విఆర్ పురం: పోలవరం ముంపు బాధితులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని, జంగారెడ్డిగూడెం తాడువాయి వద్ద పునరావాస కాలనీలు నిర్మించి వారిని సురక్షితంగా అక్కడికి తరలిస్తామని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పలుమార్లు హామీ ఇచ్చారు. అయితే వాస్తవ పరిస్థితి పరిశీలించేందుకు సీతంపేట, శ్రీరామగిరి గ్రామస్తులు శుక్రవారం అక్కడికి వెళ్లారు. అక్కడి పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. మండలంలో పునరావాస కాలనీలో ఇళ్ల పనులు 60 శాతం కూడా పూర్తి కాలేదు. కొన్నిచోట్ల మొండిగోడలతో దర్శనమిస్తుంటే, కొన్నిచోట్ల ఇంకా పునాదుల దశలోనే ఇళ్లు ఉన్నాయి. పరిస్థితి ఇలా ఉంటే జూన్ నెలలోగే బాధితులను తరలిస్తామని అధికారులు ఎలా చెప్తారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెల రాకుండానే ఒక పక్క వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. జులైనెల వచ్చేసరికి వరదలు వస్తే ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయకుండా ఎలా తరలిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి కాలనీలను పరిశీలించాలని విజ్ఞప్తిచేశారు. యుద్ధప్రాతిపదికన పెండింగ్ పనులు పూర్తి చేసి నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

మత్స్యకార భరోసా సగం మందికే..

వినతం అందిస్తున్న వైసిపి దక్షిణ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా 50 శాతం మంది అర్హులకు అందలేదని మాజీ ఎమ్మెల్యే వైసిపి దక్షిణ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. ఉత్తరాంధ్ర మత్స్యకారులకు జాతర రూ.20 వేల వేట విరామ భృతి అందించారు. శుక్రవారం ఆసీలుమెట్ట కార్యాలయంలో మత్స్య పారిశ్రామిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు, ఉపాధ్యక్షుడు కాసరపు వెంకటేశ్వరరావు లకు వినతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా క్రమం తప్పకుండా చెల్లించేవారమన్నారు. మత్స్యకార భరోసా అర్హులందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఒత్తిడి దూరం

రాజవొమ్మంగి, మారేడుమిల్లిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - సీలేరు: యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఒత్తిడి తగ్గుతుందని జికె వీధి మండలం సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి భరద్ మస్తాన్‌వలి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం స్థానిక పిహెచ్‌సి ఆవరణలో యోగ శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారులు సౌమ్య హోమియో వైద్యాధికారి సుజనారాయ్ ఆధ్వర్యంలో ప్రారంభించామన్నారు. ప్రతిరోజు సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక పంచాయితీ కార్యదర్శి సంధ్యారాణి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాసనాల తరగతులు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కిశోర బాలికలకు, విద్యార్థులకు స్థానిక పంచాయితీ కార్యాలయం ఆవరణలో యోగా నిర్వహించారు. యోగా వల్ల కలిగే ఉపయోగాలను గూర్చి కార్యదర్శి సంధ్యారాణి వివరించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మారేడుమిల్లి మండల కేంద్రం మారేడుమిల్లి నీల్ ఆర్గాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్విజ్ పోటీలు, యోగాసనాలు నిర్వహించారు. మండల అధ్యక్షురాలు కుమారి సార్ల లలితకుమారి, జెడ్‌పిటిసి గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపిపి లక్ష్మణ రవికుమార్, సర్పంచ్ కొండ జాకబ్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ చైతన్య, ఎంఇఒ ముత్యాలరావు, సెక్రటరీ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

అందని డైట్ బిల్లులు

- ఎనిమిది నెలలుగా అప్పులతోనే నిర్వహణ
- అవస్థలు పడుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నిర్వాహకులు

ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు (ఫైల్)

ప్రజాశక్తిహుకుంపేట: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు ఎనిమిది నెలలుగా డైట్ బిల్లులు చెల్లించక పోవడంతో హాస్టల్స్ నడిపే వార్డెన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ 2024 నుండి మే 2025 వరకు మొత్తం 8 నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఆశ్రమ వసతి గృహాల పరిస్థితి దిగజారి పోయింది.

పాడేరు, జి.మాడుగులు, ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట మండలాల్లోని వసతి గృహాల నిర్వహణకు వార్డున్లు అప్పులపై ఆధార పడుతున్నారు. నిత్యావసరాలైన కూరగాయలు, చికెన్, ఇతర కిరాణా సరుకుల కొనుగోలుకి స్థానిక వ్యాపారులు ఇక అరువు ఇవ్వలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికే చాలీచాలని మెస్ చార్జీలతో కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది.పిల్లలకు వైద్య పరీక్షలు, ఇతర సౌకర్యాల ఖర్చులు భరించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు బిల్లులు పంపించినా ఇప్పటివరకు స్పందన రాలేదు. హాస్టల్స్ ఎలా నడపాలన్న సందిగ్ధంలో ఉన్నాం," అని ఆశ్రమ పాఠశాల వార్డెన్ ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 13న పాఠశాలలు పున్ణప్రారంభం కానుండగా, పాత బిల్లులు ఇంకా చెల్లించకపోవడంతో మళ్లీ అప్పులు చేసి హాస్టల్స్ నడిపే పరిస్థితి తలెత్తుతోంది. గత ఎనిమిది నెలలుగా ఐటిడిఏ ద్వారా బిల్లులు విడుదల కాకపోవడంతో అధికారులు ఎవరిని అడగాలో కూడా తెలియని స్థితిలో ఉన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సత్వర నిర్ణయం తీసుకుని డైట్ బిల్లులు విడుదల చేయాలని వసతి గృహ వెల్ఫేర్ అధికారులు కోరుతున్నారు.

'సాయి గణపతి'లో 2 నుంచి ఉచిత బ్రిడ్జి కోర్సు తరగతులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలో గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరబోయే విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రిడ్జ్ కోర్స్ తరగతులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై మహేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సు ద్వారా, విద్యార్థులు 10వ తరగతి వరకు నేర్చుకున్న సబ్జెక్టుల నుంచి పాలిటెక్నిక్ విద్యలో ఉండే సబ్జెక్టులకు సరళమైన మార్గాన్ని ఏర్పరచుకునే అవకాశం లభించనుందన్నారు. జూన్ 2 నుంచి ప్రారంభమైన ఈ బ్రిడ్జికోర్సు రెండు వారాలపాటు జరుగుతుందన్నారు. జూన్ 2 నుంచి ఈకోర్సుకు ఏ విధమైన ఫీజు, సర్టిఫికెట్‌లు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సుకు అవసరమైన ప్రాథమిక జ్ఞానాన్ని బలపర్చేలా తరగతులు రూపొందించబడ్డాయన్నారు.కళాశాల కరస్పాండెంట్ ఎస్. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, ఎస్‌కోట, భీమిలి వంటి ప్రాంతాల నుంచి ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 95814 67711, 87906 35885 , 81425 89853,95819 50681 నెంబర్లకు సంప్రదించాలన్నారు

రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ / ఎంవిపీ కాలని : జూన్ 10న విశాఖపట్టణంలో జరగనున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము విచ్చేస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ భవనంలో శుక్రవారం విసి టి.వి.కట్టిమణితో కలిసి వివిధ అంశాలపై సమీక్షించిన ఆయన అధికారులకు కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. జూన్ 10 ఉదయం 11.30 గంటలకు రాష్ట్రపతి విశాఖపట్టణం అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారని, అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా బీచ్ రోడ్డు లోని ఎయు కన్వెన్షన్ హాలుకు విచ్చేస్తారని పేర్కొన్నారు. అక్కడ జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవంలో పాల్గొంటారని చెప్పారు. 12 గంటల నుంచి 1 గంటల వరకు జరిగే కార్యక్రమ అనంతరం ఆమె రోడ్డుమార్గం ద్వారా విమానాశ్రయానికి చేరుకొని తిరిగి పయనమవుతారని వివరించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు మార్గం ద్వారా రానున్న నేపథ్యంలో సుందరీకరణ పనులు, మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. జ్ఞానాపురం రేల్వే అండర్‌పాస్ వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒకవేళ వర్షం కురిస్తే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలని జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐఎన్ఎస్ డేగా నుంచి కన్వెన్షన్ హాలు వరకు ఎలాంటి హోర్డింగులు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులు లేకుండా తొలగించాలని సూచించారు. ఎయు కన్వెన్షన్ హాలు వద్ద సీటింగ్ ఏర్పాట్లు, ప్రొటొకాల్ నిబంధనలు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రాష్ట్రపతితో పాటు, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రానున్న క్రమంలో ప్రత్యేక గ్రీన్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు మార్గంలో, ఎయు కన్వెన్షన్ హాలు వద్ద పారిశుద్ధ్య పరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు.

బీచ్‌రోడ్‌లోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

నిపుణులతో కూడిన వైద్యబృందం,అత్యంత ఆధునిక వసతులు కలిగిన అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విసి టి.వి.కట్టిమణి, డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, డిఆర్‌ఓ బిహెచ్ భవానీశంకర్, ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

జూన్ 10న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో ఆమె పర్యటించే ప్రాంతాల్లో ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్ ఎన్ హరేంధిరప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. మొదట బీచ్‌రోడ్ లోని ఎయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ట్రైబల్ యూనివర్సిటీ విసి టీవీ కట్టమణి , ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

లంకపాకల వద్ద బురదమయమైన ప్రధాన రహదారి

ఐస్‌గెడ్డ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం లంకపాకల వద్ద ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. రహదారి మొత్తం బురదమయం కావడంతో ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. గత కొద్ది రోజులు నుంచి ఏజెన్సీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రహదారి పెద్దపెద్ద గోతులుగా మారి వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ రోడ్డుందో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. జికె వీధి మండలం ఆర్.వి నగర్ నుంచి పాలగెడ్డ వరకూ అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణపనులు చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. రహదారి పనులకు గత ఏడాది టెండర్లు నిర్వహించినా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. సీలేరు సమీపంలోని ఐస్‌గెడ్డ వద్ద ఉన్న మలుపు అయితే ప్రాణాంతకంగా మారింది. మలుపులో వచ్చే వాహనాలు కనబడడం లేదని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రభుత్వం రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినా ఎందుకు పనులు చేపట్టలేదని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల చింతపల్లి సబ్ డివిజనల్ ఎస్పి నవజ్యోతిమిశ్రా పర్యవేక్షణలో జికె వీధి సీఐ వరప్రసాద్ ఎస్ఐ అప్పలసూరి గోతులు పూడ్చించారు. కొంతవరకూ రహదారి బాగుందని అనుకున్న సమయంలో వర్షాలు కురవడంతో మరింత బురదమయంగా తయారైందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నైజీరియాలో పెట్టుబడి అవకాశాలపై 'గీతం'లో అవగాహనా సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్

ప్రజాశక్తి- మధురవాడ : ఆఫ్రికాలోని నైజీరియాలో 34 ఏళ్ల క్రితం ఏర్పడిన జిగావా రాష్ట్రంలో భారతీయులకు పెట్టుబడి అవకాశాలపై ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఎపిసిసిఐఎఫ్) ఆధ్వర్యంలో గీతంవిశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్‌లో శుక్రవారం పెట్టుబడిదారుల సదస్సు సమావేశం నిర్వహించారు జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్ నమాది నేతృత్వంలో నైజీరియా వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన సీనియర్ అధికారులు, జిగావా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఫార్మర్స్ అండ్ హర్డ్స్‌మెన్ మేనేజ్‌మెంట్ బోర్డుకు చెందిన సాంకేతిక నిపుణుల బృందం జిగావాలో వ్యవసాయాభివృద్ధి, అంతర్జాతీయ సహకారం, తమ రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించారు.

ఈ సందర్భంగా జిగావా గవర్నర్ మల్లం ఉమర్ నమాది మాట్లాడుతూ, వ్యవసాయ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పనకు తమ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వ్యూహాత్మక చర్యలను వివరించారు. గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, వ్యవసాయ, వాణిజ్యం, ఎగుమతులను సులభతరం చేసే విధానాలను అమలు చేస్తోందన్నారు. ఎగుమతి ప్రోత్సాహక వ్యూహం, సంపూర్ణ అభివృద్ధి వంటి నూతన విధానాలు నైజీరియా జాతీయ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయన్నారు. వ్యవసాయ రంగ పెట్టుబడులకు పన్ను రాయితీలు, భూమి కేటాయింపు, లైసెన్సింగ్, కంపెనీ రిజిస్ట్రేషన్ ప్రక్రియల సరళీకరణ, నవీకరించిన జిగావా వ్యవసాయ పాలసీలను వివరించారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన గీతం ప్రో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమరావు జిగావా ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధారితమైనదని, ఉందని, ఆ రాష్ట్ర జిడిపిలో అరవైశాతం పైగా వ్యవసాయమేనని, ప్రజల స్నేహపూర్వకంగా ఉంటారన్నారు.. ఎగుమతి అనుకూలమైన నువ్వులు,వేరుశెనగ, బియ్యం, గోధుమ వంటి పంటలు జిగావా భారతీయ వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు మంచి అవకాశాల్ని అందిస్తున్నాయన్నారు.

జిగావాలో డెయిరీ స్టార్టప్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న భారతీయ పారిశ్రామికవేత్త చంద్రశేఖర్ మాట్లాడుతూ నైజీరియాలో 200 భారతీయ కంపెనీలు వివిధ రంగాల్లో పెట్టుబడి పెట్టి స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నాయన్నారు., ఇటీవలి ద్వైపాక్షిక ఒప్పందాలతో నైజీరియాలో భారత పెట్టుబడులను మరింత పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గీతం ఇంటర్నేషనల్ స్టూడెంట్ వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ కె.పి.కిషన్, ఎపిసిసిఐఎఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ యార్లగడ్డ గీత, వైస్ ఛైర్‌పర్సన్ లీలారాణి, గీతం బిజినెస్ స్కూల్ ఫ్యాకల్టీ సభ్యులు, నగరానికి చెందిన పలువురు పెట్టుబడిదారులు. పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

కిశోర వికాసం పరిశీలన

ప్రజాశక్తి- ఆనందపురం: భీమిలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గంభీరం, గొంతినవానిపాలెం అంగన్వాడీ కేంద్రాలను యునిసెఫ్ ప్రతినిధి మేరీ జోన్స్ సందర్శించారు. ఆయా కేంద్రాల్లో కిశోరి వికాసం అమలు తీరును పరిశీలించారు.కిశోరి బాలికలతో ప్రత్యక్షంగా చర్చించి, వారు నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 2 నుంచి వచ్చేనెల 10 వరకు నిర్వహించనున్న కిశోరి వికాసం అమలుతీరును ప్రశంసిస్తూ, బాలికల అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతోందని అభిప్రాయపడ్డారు. దీనిద్వారా బాలికల్లో ఆరోగ్య శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, లైంగిక విద్య, మాతాశిశు పోషణ, హక్కులు, భద్రత, బాధ్యతలు, ఇతర సామాజిక అంశాలపై అవగాహన పెంపొందుతుందన్నారు. కార్యరకమంలో సిడిపిఒలు శ్రీలత, ఎం.శ్రీదేవి, ఐసిపిఎస్ ప్రతినిధి మమత, సూపెర్వైజర్లు పివివి. రత్నం బి. సరిత, ఎంఎస్‌కెలు, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షులు నారాయణరావు

థియేటర్లలో తినుబండారాల ధరలను నియంత్రించాలి

- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షులు నారాయణరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో సినిమా థియేటర్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా తినుబండారాల ధరలు విపరీతంగా పెంచి దోపిడీ చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షులు జి.ఎ.నారాయణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు చెందిన నలుగురు ఎపిలో దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. థియేటర్లను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, రాష్ట్రంలో ఫిల్మ్‌చాంబర్ ఏర్పాటు చేయాలన్నారు. థియేటర్లలో తినుబండారాల వ్యవహారంపై వారం రోజుల్లోగా తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ, తోట రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా డే పకడ్బందీగా నిర్వహించాలి

- సమీక్షలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జూన్ 21న విశాఖపట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ విసి హాల్లో అధికారులతో సమీక్షించారు. 21న కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసే వేదికలతో పాటు, అనువైన ప్రాంతాల్లో మరొక 25 అదనపు వేదికలు ఏర్పాటు చేస్తున్నామని అక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని నిర్దేశించారు. ప్రధాన వేదికతో పాటు ఎంజిఎం గ్రౌండ్, విఎంఆర్డిఎ పార్కు, అప్పూఘర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్, విశాఖవ్యాలీ రోడ్డు, రుషికొండ, గీతం కళాశాల, సాయిప్రియ రిసార్టు, ప్రేమ సమాజం, రామానాయుడు స్టూడియో కింది భాగం, కాపులుప్పాడ, చేపలుప్పాడ, భీమిలి హౌసింగ్ బోర్డు లే అవుట్, ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని మైదానంలో యోగాసనాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. కాళీమాత ఆలయం నుంచి భీమిలి డబుల్‌రోడ్డు వరకు ప్రధాన వేదిక గుండా సుందరీకరణ పనులు, మరమ్మతులు త్వరగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, డిఆర్‌ఓ బిహెచ్ భవానీ శంకర్, ఆర్‌డిఒలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్, జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ ట్రావెల్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రయాణ అవసరాల కోసం తమ స్మార్ట్ ట్రావెల్‌స్టోర్‌ను ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్టు అమెజాన్ ఇండియా ప్రతినిధి శ్రీన్ వెల్లడించారు. శుక్రవారం ఆయన ఓ హోటల్లో ఆతిథ్య రంగానికి చెందిన ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.99కి అమెజాన్ బజార్ ప్రయాణ అవసరాలతో స్మార్ట్‌ట్రావెల్ స్టోర్ ప్రారంభం కాగా, రూ.150 వరకు క్యాష్‌బాక్ పొందవచ్చన్నారు. సండే బజార్‌లో 80 శాతం వరకు ఆదా ఉంటుందన్నారు.

పరిశ్రమలు నెలకొల్పే వారికి సహకారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక ఔత్సాహికులకు పూర్తి సహకారం అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. గంగవరం పోర్టు నుండి నేషనల్ హైవే రోడ్డు కనెక్టివిటీ, ఎపిఐఐసి ఇండస్ట్రీస్ నందు 30 వ్యక్తిగత యూనిట్లకు వాటర్ టాక్స్, ఎపిఐఐసి ఐలా, ఆటోనగర్, మధురవాడ ఐటి పార్క్ వద్ద బస్టాప్ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం ఆదిశేషు, వివిధ పరిశ్రమల నిర్వాహకులు, ఐలా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.